సాక్షి హనుమకొండ

బుధవారం । 5 । మార్చి । 2025



డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

కేయూ పరిధిలో నిర్వహించిన డిగ్రీ కోర్సు సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ మంగళ వారం విడుదల చేశారు.

- 8లో▸



ఆర్థిక స్థోమతే అడ్డు..

రైతులు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసు కోవాలనే ఆసక్తి ఉన్నా.. ఆర్థిక స్థోమత అడ్డు వస్తుండటంతో దరఖాస్తు చేసుకోవడం లేదు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
35⁰ /20⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయం లో ఆహ్లాదంగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
బుధ 6:30	గురు 5:09

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

శిల్పకళ అద్భుతం..



ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణ శైలి, నల్ల రాతితో రూపొందించిన శిల్ప కళ వెరీ అద్భుతం అని స్టేట్ ఆర్కియాలజీ ఆఫ్ మైసూర్ ఎ.దేవరాజ్, హైదరాబాద్ సర్కిల్ కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ హెచ్.దేశాయ్ అన్నారు. ఖిలా వరంగల్ కోటను వారు మంగళవారం సాయంత్రం సందర్శించారు. కాకతీయుల ఖ్యాతిని కొనియాడారు. వారి వెంట కేంద్ర పురావస్తుశాఖ కోట ఇన్‌చార్జ్ శ్రీకాంత్, టీజీ టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ జాగిలాల పాత్ర కీలకం: సీపీ



వరంగల్ క్రైం: నేరాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడంలో పోలీస్ జాగిలాలు కీలకంగా నిలుస్తున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు నూతనంగా వచ్చిన పోలీస్ జాగిలాలను సీపీ మంగళవారం పరిశీలించారు. గత నెలలో మొయినాబాద్‌లోని పోలీస్ జాగిలాల శిక్షణా కేంద్రంలో శిక్షణను పూర్తి చేసుకుని వచ్చిన ఐదు పోలీస్ జాగిలాలు వరంగల్ కమిషనరేట్ పోలీస్ డాగ్ స్క్వాడ్‌లో చేరి విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. పేలుడు పదార్థాలను పసిగట్టే ఈ ఐదు జాగిలాల్లో మూడు బెల్జియన్ మాలినోస్, రెండు గోల్డెన్ రీట్రీవర్ జాతులకు చెందినవి ఉన్నాయి. నూతనంగా వచ్చిన ఈ జాగిలాలకు సంబంధించిన పూర్తి వివరాలను సీపీకి హ్యాండ్లర్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, హ్యాండ్లర్లు రాజేశ్‌కుమార్, వెంకన్న, సురేశ్, దిలీప్ పాల్గొన్నారు.

కెరీర్ కౌన్సెలింగ్ సెల్ డైరెక్టర్‌గా చిర్ర రాజు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెల్ నూతన డైరెక్టర్‌గా తెలుగు విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజు నియమితులయ్యారు. ఈమేరకు రిజిస్ట్రార్ వి.రామచంద్రం మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పదవిలో రాజు ఏడాదిపాటు కొనసాగుతారు. ఆయన కేయూ పాలకమండలి సభ్యుడిగా కూడా ఉన్నారు.

30 ఏళ్లు దాటిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలి



హసన్‌పర్తి: 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ అప్పయ్య ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నట్లుగా నిర్ధారణ అయితే చికిత్స ప్రారంభించాలని సూచించారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డేను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి డీఎంహెచ్ఓ అప్పయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాలను వందశాతం విజయవంతం చేయాలన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి తగిన సేవలందించాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులపై అవగాహన నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి భార్గవ్, వైద్యులు కృతిక, సురేశ్, హెల్త్ సూపర్‌వైజర్ లచ్చు, మేరీ, రుతమ్మ, ఫార్మసిస్ట్ అజిత, స్టాఫ్‌నర్స్ విజయకుమారి, హెల్త్ అసిస్టెంట్ సంతోశ్, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు.. దొంగలు

నగరంలో ఆధునిక సాంకేతికతతో విద్యుత్ చౌర్యం

- తనిఖీల్లో గుర్తించి విస్తుపోతున్న ఎన్పీడీసీఎల్ అధికారులు
- ఇప్పటివరకు 12 కేసులు నమోదు
- దొంగతనం చేసేది త్రీ ఫేజ్ మీటర్ల వినియోగదారులే..



మీటర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

> నాలుగు రోజుల్లో హనుమకొండ నగరంలో 1119 సర్వీస్‌లు తనిఖీ చేశారు. ఇందులో 12 సర్వీస్‌లు విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు గుర్తించారు. ఆపరేషన్ విభాగానికి చెందిన 57, డీపీఈకి చెందిన 15 ప్రత్యేక బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి.

హన్మకొండ: విద్యుత్ లైన్లకు నేరుగా కొక్కాలు తగిలించి, దొంగ చాటుగా విద్యుత్ లైన్ల నుంచి వైరులాగి విద్యుత్ చౌర్యానికి పాల్పడడం చూశాం. గతంలో మీటర్ ఉత్పత్తిలో సాంకేతిక లోపంతో టీవీ రిమోట్ ద్వారా మీటర్ రీడింగ్‌ను నిలిపివేసిన ఘటనలూ చూశాం. ప్రస్తుతం వరంగల్ మహానగరంలో గతానికి భిన్నంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఘటనలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. టీజీ ఎన్పీడీసీఎల్ ఇంజనీర్లకు సవాల్ విసిరినట్లుగా సాగుతున్న విద్యుత్ చౌర్యం సాగుతున్న తీరు విద్యుత్ వర్గాల్లో కలకలం రేపుతోంది. ప్రధానంగా గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న త్రీ ఫేజ్ మీటర్ల ద్వారా కొందరు వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఘటనలు విస్తుగొలుపుతున్నాయి.

చౌర్యం ఇలా..

విద్యుత్ లైన్ ద్వారా మీటర్లకు సర్వీస్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. అదే మీటర్ నుంచి విద్యుత్ బయటకు వస్తుంది. మీటర్ లోపలకు వెళ్లి, బయటకు విద్యుత్ సరఫరా జరిగినప్పుడు మీటర్‌లో యూనిట్లు నమోదు అవుతాయి. విద్యుత్ మీటర్‌లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ మీటర్‌లోకి వెళ్లడం, మీటర్ నుంచి వినియోగానికి బయటకు రావడం జరుగుతుంది. ఇదే కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మీటర్‌లోని మదర్ బోర్డుకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో విద్యుత్ రీడింగ్ నమోదవుతుంది. త్రీ ఫేజ్‌లో ఏ ఫేజ్‌లో విద్యుత్ అధికంగా వినియోగమవుతుందో మదర్ బోర్డుకు వెళ్లే ఆ ఫేజ్ వైర్‌ను కట్ చేస్తున్నారు. దీంతో మీటర్‌లో యూనిట్లు తక్కువగా నమోదు అవుతున్నాయి. మదర్ బోర్డుకు వెళ్లే ఫేజ్‌వైర్‌ను కట్ చేయడం వల్ల కరెంట్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదు. దీన్ని గుర్తించాలంటే మీటర్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తేనే సాధ్యమవుతుంది.

గుర్తించారిలా..

ఎన్పీడీసీఎల్‌లోని విద్యుత్ సర్వీస్‌ల ప్రత్యేక విభాగం నిరంతరం తనిఖీలు చేస్తుంటుంది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం హనుమకొండ నయీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌ను తనిఖీ చేయగా ఈవిద్యుత్ చౌర్యం సంఘటన వెలుగు చూసింది. టాంగ్ టెస్టర్ ద్వారా మూడు ఫేజ్‌లు పరీక్షించగా.. ఒక ఫేజ్‌లో విద్యుత్ మదర్ బోర్డుకు చేరడం లేదని గుర్తించారు. ఈ క్రమంలో ఎన్పీడీసీఎల్ ఆపరేషన్, డీపీఏ విభాగం వారు గ్రూపులుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో హనుమకొండ అడ్వొకేట్స్ కాలనీలోని ప్రముఖ విద్యాసంస్థతోపాటు, హనుమకొండ చౌరస్తాలో బట్టల షాపు, అశోక హోటల్ సమీపంలోని బిర్యానీ సెంటర్‌తో పాటు మొత్తం 12 విద్యుత్ సర్వీసులు ఇదే విధంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతోపాటు వరంగల్‌లో ఒక్కరికే చెందిన రెండు బేకరీల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ట్యాంపరింగ్ చేస్తామని తిరుగుతున్న బృందాలు..

విద్యుత్ మీటర్ రీడింగ్ తగ్గిస్తామని ప్రత్యేకమైన నిపుణులు నగరం, పట్టణాల్లో తిరుగుతున్నారని విద్యుత్ అధికారులు తెలిపారు. రూ.10 వేలు ఇస్తే మీటర్ రీడింగ్ నమోదు కాకుండా చేస్తామని చెబుతున్నారని, ఇప్పటి వరకు విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారంతా డబ్బులు చెల్లించి ఆ ప్రత్యేక నిపుణులచే విద్యుత్ మీటర్‌ల టాంపరింగ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. విద్యుత్ విజిలెన్స్ విభాగం అధికారులు మీటర్ ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్న వారి కోసం శోధిస్తున్నారు.

తనిఖీలు విస్తృతం చేశాం...



అత్యంత చాకచక్యంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. ఇది నేరం. రూ.10 వేలు ఇస్తే యూనిట్లు తక్కువగా నమోదయ్యేలా మీటర్‌లో మార్పులు చేస్తామని కొందరు తిరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వారిపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి విద్యుత్ చౌర్యానికి పాల్పడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

– జి.సాంబరెడ్డి, డీఈ, హనుమకొండ టౌన్

5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి



- నేటినుంచి ఇంటర్ పరీక్షలు
- కేంద్రాల్లో అన్ని వసతులు

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు నిర్దేశించిన సమయం ఉదయం 9గంటల తర్వాత ఐదు నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించబోరు. ఈసారి పరీక్ష కేంద్రాన్ని గుర్తించేలా హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు. ఈ మేరకు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారంనుంచి ఇంటర్ ఫస్టియర్, 6వ తేదీ నుంచి సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. మంగళవారం అన్ని పరీక్ష కేంద్రాల్లో సీటింగ్ అరేంజ్‌మెంట్ చేశారు. హనుమకొండ జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తంగా 39,980మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికోసం 55 సెంటర్లు ఏర్పాటు చేశారు. 55 మంది చీఫ్‌సూపరింటెండెంట్లను, 55 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను 1050మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల కేంద్రాలకు 42మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. వరంగల్ జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కలిపి 12,321 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వీరికి 26 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశారు.

అన్నిచోట్లా నిఘా

అన్ని సెంటర్లలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటుచేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రధాన ద్వారం వద్ద, ప్రిన్సిపాల్ గది, వరండా, ఒకవేళ పరీక్ష పూర్తయ్యాక వేరే గదిలోజవాబు పత్రాల ప్యాకింగ్ చేస్తే అక్కడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని హైదరాబాద్‌లోని ఇంటర్‌బోర్డ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. సంబంధిత ఉన్నతాధికారులు అక్కడి నుంచే ప్రతీ పరీక్ష కేంద్రంలోకి వచ్చి వెళ్లేవారు ఎవరనేది పరిశీలించే అవకాశం ఉంది. సెంటర్ సమీపంలో 144 సెక్షన్, జిరాక్స్ సెంటర్ల మూసివేత ఉంటుంది.

కేంద్రాల్లో వసతుల కల్పన

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నారు. పరీక్షల సమయానికనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8–15 గంటల నుంచే లోనికి అనుమతిస్తారు. ఫోన్లు అనుమతించరు. ఫీజుల పేరుతో కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్ ఇవ్వకుంటే.. టీజీబీఐఈ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆ హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని, అలా ఎవరైనా హాల్‌టికెట్‌తో వచ్చినా అనుమతించాలని ఇప్పటికే డీఐఈఓ సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు.



కమలాపూర్ పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

> **పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 చట్టం అమలు**
>
> వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియెట్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల పరిధిలో 163 బీఎన్ఎస్ చట్టం అమలు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పరీక్ష కేంద్రాల నుంచి 500 మీటర్ల పరిధిలో గుంపులుగా ఉండడం, ర్యాలీలు, సభలు, ధర్నాలు, సమావేశాలు, ఊరేగింపులు చేయడం నిషేధమని పేర్కొన్నారు. పరీక్ష సమయాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఎవరైనా ఉత్తర్వులు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఐలోని మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. ఈఏడాది జనవరి 2025 నుంచి 44 రోజులకుగాను.. హుండీల్లో రూ.42,64,669, వివిధ ఆర్జిత సేవా టికెట్ల ద్వారా.. రూ.1,35,94,297లు రాగా.. మొత్తం రూ.1,78,58,966ల నగదు సమకూరినట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు. హుండీల్లో లభ్యమైన వెండి, బంగారాన్ని యథావిధిగా హుండీలోనే వేసి సీల్ చేసినట్లు తెలిపారు. లెక్కింపులో కానిస్టేబుళ్లు పి.రమేశ్, శ్రీనివాస్, ప్రశాంత్, ఒగ్గు పూజారులు మజ్జిగ అశోక్, రాములు, మహబూబాబాద్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు, దేవాలయ అర్చక, సిబ్బంది తదితరులున్నారు.



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, పరిశీలకులు అనిల్‌కుమార్

నాణ్యతా ప్రమాణాల పరిశీలన

కమలాపూర్: కమలాపూర్ పీహెచ్‌సీ పరిధి గూడూరు, ఉప్పల్ పీహెచ్‌సీ పరిధి గుండేడు, ఎల్కతుర్తి మండలం కేశవాపూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (ఏఏఎం)లను జాతీయ నాణ్యతా ప్రమాణాల కోసం ఎన్‌క్వాస్ రాష్ట్ర కన్సల్టెంట్ వినయ్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల భవన నిర్మాణం, హెర్బల్ గార్డెన్, బయో మెడికల్ వేస్టేజీ, రోగులకు అందుతున్న సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఏర్పాటు చేసి వాటి బలోపేతానికి నాణ్యతా ప్రమాణాలు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి ఎండీ.రుక్మోద్దీన్, జిల్లా నాణ్యతా ప్రమాణాల ఇన్‌చార్జ్ మేనేజర్ సాగర్, వైద్యాధికారి డాక్టర్ పద్మజ, ఏఏఎం వైద్యులు సంయుక్త, మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



గూడూరు ఏఏఎంను పరిశీలిస్తున్న వినయ్, తదితరులు

ఇళ్ల జాబితాలో అవకతవకలుంటే చర్యలు

- పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: 'ఇది ప్రజా ప్రభుత్వం. పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ పథకం అమలులో లీడర్ అయినా.. కేడర్ అయినా పైసలు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

జిల్లాను అగ్రభాగాన నిలపాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి జిల్లాను అభివృద్ధిలో, సంక్షేమ పథకాల అమలులో అగ్రభాగాన నిలపాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని డైరీని ఆవిష్కరించారు. అనంతరం టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములై కలెక్టర్ మార్గదర్శకంలో సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం హనుమకొండ సిటీ ఉద్యోగుల క్యాలెండర్, పంచాయతీ కార్యదర్శుల క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ నాయకులు బైరి సోమయ్య, వేణుగోపాల్, పనికెల రాజేశ్, శ్యాంసుందర్, రామునాయక్, మోయిజ్, లక్ష్మీప్రసాద్, ప్రణయ్, పృథ్వీ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, నరేశ్, నాయకులు రాజమౌళి, సురేశ్, రాజేశ్‌ఖన్నా, రాజ్యలక్ష్మి, సింధురాణి, పావని, శ్రీలత ఉన్నారు.

విస్తృత అవగాహన కల్పించాలి

దివ్యాంగులకు ఇస్తున్న సదరం ధ్రువీకరణ పత్రానికి బదులు ప్రత్యేక యూనిక్ డిజబిలిటీ ఐడెంటిఫికేషన్ కార్డు (యూడీఐడీ) జారీ నేపథ్యంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో యూడీఐడీ మార్గదర్శకాలపై అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో డీఆర్డీఓ మేన శ్రీను, డీఎంహెచ్ఓ అప్పయ్య, ఎంజీఎం సూపరింటెండెంట్ అంబి శ్రీనివాస్, జిల్లా సంక్షేమాధికారి జయంతి పాల్గొన్నారు.

అర్హుల జాబితాను సిద్ధం చేయండి

జిల్లాలో 'మిషన్ వాత్సల్య' పథకానికి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మిషన్ వాత్సల్య పథకం అర్హుల ఎంపికపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు లేని బాలబాలికలకు మొదటి ప్రాముఖ్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బాల రక్షాభవన్ జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, సీడబ్ల్యూజీ మెంబర్ సుధాకర్, ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక, శిశుగృహ ఇన్‌చార్జ్ మేనేజర్ మాధవి, సోషల్ వర్కర్లు శ్రీనివాసులు, సునీత, చైతన్య పాల్గొన్నారు.



టీఎన్జీఓస్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు

బోధన లక్ష్యాలను గుర్తించాలి

కాశీజీ సెంటర్: బోధన లక్ష్యాలను గుర్తించాలని వరంగల్ జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్ తేజ అన్నారు. ఉమ్మడి జిల్లాలో 2024 డీఎస్సీ ద్వారా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ మంగళవారం వరంగల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను ఉపాధ్యాయులు తెలుసుకొని విద్యార్థులకు కృత్యాలతో అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.

రెవెన్యూ అధికారుల సర్వే



శ్రీరాములపల్లిలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

కమలాపూర్: మండలంలోని శ్రీరాములపల్లిలో రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిలువేరు శ్రీనివాస్‌పై కలెక్టర్‌కు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే చేశారు. గ్రామంలోని 286/సీ/2లో 9 గుంటలు, 287/ఏ/2లో 1.11 ఎకరాలు, 287/ఈ/2లో 26 గుంటల చొప్పున మూడు సర్వే నంబర్లలో మొత్తం 2.06 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని శ్రీనివాస్ గతేడాది సెప్టెంబర్‌లో తన పేరిట విరాసత్ పట్టా చేయించుకున్నాడని, తాము అదే భూములను 30, 40 ఏళ్ల క్రితం కొని ఇళ్లు నిర్మించుకున్నట్లు, పట్టా రద్దు చేసి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కలెక్టర్, ఆర్డీఓ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శోభారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్వేయర్ గోపీకృష్ణ గ్రామానికి వెళ్లారు. ఆభూములను సర్వే చేసి భూముల్లో ఉన్న ఇళ్లు ఎన్ని, ఖాళీ స్థలం ఎంత? అనే వివరాలతో లొకేషన్ మ్యాప్ రూపొందించారు. సర్వే నివేదికను ఆర్డీఓకు అందజేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా.. భూములకు ఇంటినంబర్లు ఎలా కేటాయించారు? శ్రీనివాస్ పాస్‌బుక్ ఎందుకు రద్దు చేయకూడదో పూర్తి ఆధారాలతో పంచాయతీ కార్యదర్శి ఈనెల 7న హనుమకొండ ఆర్డీఓ ఎదుట హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.

రేపటి నుంచి పదో తరగతి ప్రీఫైనల్స్

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని టెన్త్ విద్యార్థులకు గురువారం నుంచి 15వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈమేరకు అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు టైంటేబుల్ విడుదల చేశారు. జిల్లాలోని డీసీఈబీ (డిస్ట్రిక్ట్ పరీక్ష బోర్డు) నుంచి ఎంఈఓ కార్యాలయాలకు ప్రశ్నపత్రాలను అందుబాటులో ఉంచుతారు. అక్కడి నుంచి హెచ్‌ఎంలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. కాగా.. హనుమకొండ జిల్లాలో టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షల్ని 12,010 మంది విద్యార్థులు రాయనున్నట్లు డీఈఓ వాసంతి, డీసీఈబీ సెక్రటరీ డాక్టర్ బి.రాంధన్ సోమవారం తెలిపారు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం

మడికొండ: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. మడికొండలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. రథానికి భక్తులు ఎదురేగి నీళ్లు ఆరబోసి మంగళ హారతులతో స్వాగతం పలికారు. రథోత్సవంలో భాగంగా కోలాటం, గొల్లడప్పులు, భజన బృందాలు, చిరుతల రామాయణం, నృత్యాల మధ్య రథోత్సవం సాగింది. వేడుకల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరశురాం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, వస్కుల ఉమ, రొడ్డ దయాకర్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, కుర్ల మోహన్, తొట్ల రాజుయాదవ్ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మడికొండలో సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్లో) శివపార్వతుల కల్యాణమూర్తులు

సీఏ ఫలితాల్లో సిరిసహస్రకు ఆలిండియా 35వ ర్యాంకు



కమలాపూర్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మంగళవారం విడుదల చేసిన సీఏ ఇంటర్మీడియట్ కోర్సు ఫలితాల్లో హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన చేరాల సిరిసహస్ర ఆలిండియా 35వ ర్యాంకు సాధించింది. చేరాల రాజ్‌కుమార్, సరస్వతి దంపతుల కూతురు సిరిసహస్ర హైదరాబాద్‌లోని చాంప్స్ సీఏ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతూ సీఏ ఇంటర్మీడియట్ రెండో సెమ్ చదువుతోంది. గ్రూప్–1లో 216 మార్కులు, గ్రూప్–2లో 246 మార్కులు సాధించిన సిరిసహస్ర మొత్తం 462 మార్కులతో ఆలిండియా 35వ ర్యాంకు సాధించింది. దీంతో సిరిసహస్రను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల తోపాటు గ్రామస్తులు అభినందించారు.

రేపు కాజీపేట మీదుగా వన్‌వే స్పెషల్ ట్రైన్



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బనారస్–సికింద్రాబాద్ మధ్య వన్ వే స్పెషల్ ట్రైన్‌ను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం తెలిపారు. బనారస్‌లో బుధవారం బయలుదేరే బనారస్–సికింద్రాబాద్ (05082) వన్ వే స్పెషల్ ట్రైన్ మరుసటి రోజు (గురువారం) కాజీపేట జంక్షన్‌కు 20.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌ల సౌకర్యంతో గల ఈ ట్రైన్‌కు మార్గమధ్యలో వారణాసి, ప్రయాగ్‌రాజ్ చౌకి, సత్న, మయర్, కట్ని, జబల్‌పూర్, ఇటార్సీ, గోరఖ్‌డోంగ్రి, బెతుల్, నాగ్‌పూర్, సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్హార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

పదోతరగతి విద్యార్థి ఆత్మహత్య

- కుమారుడి మృతితో తల్లి ఆత్మహత్యాయత్నాయత్నం
- ఆస్పత్రికి తరలింపు



నాని (ఫైల్)


చిట్యాల: పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ముచినిపర్తిలో చోటు చేసుకుంది. కుమారుడి మరణవార్త విన్న తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూపతి సారయ్య, జయలక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూతురు రమ్యకు ఏపీలోని నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన లక్ష్మయ్యతో వివాహం జరిగింది. వారి కుమారుడు నాని(16) ముచినిపర్తి గ్రామంలో తాతయ్య, అమ్మమ్మ(సారయ్య –జయలక్ష్మి) వద్ద ఉంటూ జూకల్ పాఠశాలలో పదోతరగతి చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పాఠశాలకు వెళ్తానని అమ్మమ్మకు చెప్పి వెళ్లకుండా మధ్యలోనే ఇంటికి వచ్చాడు. కాగా, కూలీ పనులు ముగించుకుని జయలక్ష్మి సాయంత్రం ఇంటికి వచ్చింది. తలుపులు తీయగా రాకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే చుట్టపక్కల వారి సాయంతో తలుపులు తొలగించి చూడగా నాని ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెంది కనిపించడంతో బోరున విలపించింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థి మృతి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. నాని మరణవార్త తెలియడతో అతడి తల్లి రమ్య నెల్లూరులోని పడుగుపాడు స్వగృహంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కాగా, నాని మృతిగల కారణాలు తెలియాల్సి ఉంది.



ఆర్థిక స్థోమతే అడ్డు..

సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై సందిగ్ధంలో రైతులు

- మందకొడిగా అర్జీలు
- గడువు పెంచుకుంటూ వెళ్తున్న ప్రభుత్వం
- మరోసారి ఈనెల 10వ తేదీకి పెంపు..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 327 మంది దరఖాస్తులు



హన్మకొండ : సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై రైతులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధానంగా సాధారణ, మధ్య తరగతి రైతులకు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి ఉన్నా.. ఆర్థిక స్థోమత అడ్డువస్తుండడంతో అర్జీలు చేసుకోవడానికి మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో దరఖాస్తు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. గడువు నిర్దేశించినా.. ఆశించిన మేరకు దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం గడువు పెంచుకుంటూ పోతోంది. ముందు ఫిబ్రవరి 22వ తేదీ వరకు చివరి గడువు నిర్ణయించింది. అయినా దరఖాస్తులు పూర్తి స్థాయిలో రాకపోవడంతో మార్చి 2వ వరకు గడువు పొడిగించింది. అయినా లక్ష్యం మేరకు రైతుల నుంచి స్పందన లేక.. దరఖాస్తులు రాకపోవడంతో మరోసారి ఈ నెల 10 వరకు గడువు పొడిగించింది.

ఉమ్మడి జిల్లాలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు

జిల్లా	దరఖాస్తులు
జనగామ	97
జేఎస్ భూపాలపల్లి	48
మహబూబాబాద్	57
ములుగు	12
వరంగల్, హనుమకొండ	113
మొత్తం	327



సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు ప్రోత్సాహం..

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు, సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై రైతులను ప్రోత్సహించేందుకు 'ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్' (పీఎం కుసుం) పథకాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రైతులతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, నీటి వినియోగదారుల సంఘాలు సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా అధికారులు పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వ, దేవాలయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. వీరు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు కొనుగోలు చేస్తాయి. సాగు భూముల్లోనూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని ప్యానెళ్ల కింద పంటలు పండించుకోవచ్చు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి స్థలం 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు 5 కిలో మీటర్ల లోపు మాత్రమే దూరం ఉండాలి. 500కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల ఉత్పత్తి వరకు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యం విధించుకున్నారు. ఇందులో వెయ్యి మెగావాట్లు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా, మిగతా 3 వేల మెగావాట్లు రైతులతో ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

90 శాతం రుణ సౌకర్యం కల్పించాలని కోరుతున్న రైతులు

ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.2.97 కోట్ల ఖర్చు అవుతుంది. ఇందులో రైతులు 30 శాతం భరిస్తే బ్యాంకుల ద్వారా 70 శాతం రుణ సదుపాయం కల్పిస్తారు. 30 శాతం కింద రైతులు దాదాపు రూ.30 లక్షలు భరించాలి. దీనికి అదనంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ సరఫరా లైన్ వేసేందుకు కిలో మీటర్‌కు రూ.5 లక్షలు ఖర్చవుతుంది. దీంతో పాటు సబ్‌స్టేషన్‌లో 'బే 'ఎక్స్‌టెన్షన్‌కు రూ.6.50 లక్షలు ఖర్చు అవుతుంది. వీటితో పాటు ఒక మెగావాట్ ఉత్పత్తికి దరఖాస్తు చేసుకునేందుకు రుసుం రూ.5 వేలు చెల్లించాలి. దరఖాస్తు రుసుం రూ. 5 వేలు తిరిగి చెల్లించరు. దీంతో సామాన్య, మధ్య తరగతి రైతులు ఈ ఖర్చులు భరించలేక సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు ఊగిసలాడుతున్నారు. ఫలితంగా దరఖాస్తుల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అయితే స్వయం సహాయక సంఘాలకు అందించనున్నట్లు 90 శాతం రుణ సౌకర్యం కల్పిస్తే 10 శాతం భరించడం సులువవుతుందని రైతులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫిబ్రవరి 21 వరకు 98 దరఖాస్తులు రాగా, ఈ నెల 2 వరకు 327 వచ్చాయి. రైతులకు రాయితీ ఇస్తే ముందుకు వచ్చే అవకాశం ఉంది.

రైతులు ఖర్చు భరించడం కష్టమే..



రైతులు 30 శాతం ఖర్చు భరించడం కష్టమే. దీనికి తోడు విద్యుత్ లైన్ నిర్మాణం ఖర్చు, ఇతర ఖర్చులు భారీగా అవుతాయి. ఇవన్నీ రైతులు భరించలేరు. నాకు ప్రైవేట్ పవర్ ప్లాంట్‌లో పని చేసిన అనుభవముంది. దీంతో ప్రభుత్వం సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుందని తెలుసుకుని దరఖాస్తు చేశా. నాకు 8 ఎకరాల స్థలం ఉంది. మెగావాట్ ప్లాంట్‌కు దరఖాస్తు చేశా. దీని ద్వారా వచ్చే ఆదాయం, బ్యాంకుకు చెల్లించాల్సిన వాయిదాలు సంతృప్తి కలిగితే మిగతా స్థలంలో ఏర్పాటు చేస్తా.

– పి.అంబేద్కర్, అంబేద్కర్ నగర్, వర్ధన్నపేట

రైతులు క్రమంగా ముందుకు వస్తున్నారు..



సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడానికి రైతులు క్రమంగా ముందుకు వస్తున్నారు. రైతుల ఆసక్తిని గమనించి ప్రభుత్వం గడువు పొడిగించింది. ఇప్పటి వరకు ఆశించిన మేర దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నెల 10వ తేదీ వరకు గడువు పెంచింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – మహేందర్ రెడ్డి, రెడ్‌కో ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్

ఉద్యోగాల పేరిట మోసం..

- నిరుద్యోగుల వద్ద నుంచి డబ్బుల వసూళ్లు..
- నకిలీ నియామక పత్రాల అందజేత



మహబూబాబాద్ రూరల్ : కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి పలువురి నిరుద్యోగ యువతీయువకుల వద్ద నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతీయువకులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా ఒక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశాడు. తనకున్న పరిచయాలతో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి సుమారు 25 మంది యువతీయువకుల్లో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు డబ్బులు వసూలు చేశాడు. అనంతరం అతడు ఇచ్చిన ఉద్యోగ నియామక పత్రాలు తీసుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల ప్రభుత్వ విద్యాసంస్థల్లో జాయిన్ అయ్యేందుకు వెళ్లారు. తీరా అక్కడికెళ్లి ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలను అడిగితే అవి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలని ధ్రువీకరించారు. దీనిపై బాధితులు.. నియామక పత్రాలు అందజేసిన వ్యక్తిని అడగగా అతడు స్పందించలేదు. దీంతో ఈ ఘటనపై తమకు న్యాయం చేయాలని మహబూబాబాద్ టౌన్ పోలీసులను ఆశ్రయించనున్నట్లు సమాచారం.

లైంగికదాడి కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు



కాటారం: బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి జిల్లా కోర్టు న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం తీర్పు వెలువరించినట్లు మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం కనుకునూరు గ్రామానికి చెందిన అట్టెం మల్లయ్య 2019లో మండలానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాము.. మల్లయ్యపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా అప్పటి సీఐ శివప్రసాద్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత సీఐ హథీరాం మరికొందరు సాక్షులను విచారించగా కాటారం డీఎస్పీగా ఉన్న ప్రస్తుత భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్ కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కొన్ని రోజులుగా కోర్టులో విచారణ కొనసాగగా డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునారావు, ఎస్సై మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో భాగంగా జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణువర్ధన్‌రావు వాదనలు వినిపించగా నేరం రుజువైంది. దీంతో మల్లయ్యకు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నారాయణబాబు తీర్పు వెలువరించారు. కాగా, నిందితుడికి శిక్షపడేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన డీఎస్పీ, సీఐ, ఎస్సైతో పాటు కోర్టు లైజనింగ్ ఆఫీసర్, ఏఎస్సై వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ రమేశ్‌ను ఎస్పీ కిరణ్‌ఖరే అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ BA/B.Com/B.Sc/ BBA / BBM/ Diploma / MA / M.Com/ M.Sc/ MBA / MCA/ B.Tech / D.Pharmacy/ B. Pharmacy/ LLB/ BAMS / BHMS పూర్తి చేయండి ✆ 99895 30727 [B-755673]

REAL ESTATE

HOUSE FOR SALE

■ House for sale 164 sq.yards West Face Near Relief Hospital Arepally, Warangal. 68 Lakhs. Loan Available. Cell: 9652715142 [W-1265058]

SERVICES

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

WANTED

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25001913]

■ కావలెను. కేర్ టేకర్స్, నర్సులు విజయవాడలో పేషంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు అత్యధిక జీతం+వ+భో. ఆంధ్ర హోమ్ కేర్, VJA ✆ 91608 35559, 93473 80332 [B-513]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కరెంట్‌తో చేపలు పడుతూ మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- పురుషోత్తమాయగూడెం ఆకేరు వాగులో ఘటన



శశి (ఫైల్)

మరిపెడ రూరల్: మిత్రులతో కలిసి చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు.. కరెంట్‌తో చేపలు పడుతూ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగులో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పురుషోత్తమాయగూడెం స్టేజీకి చెందిన జర్పుల కోట, అరుణ దంపతుల చిన్న కుమారుడు శశి (20) అదే గ్రామానికి చెందిన మిత్రులతో కలిసి ఆకేరు వాగులో చేపల వేటకు వెళ్లాడు. అక్కడ విద్యుత్‌ను ఉపయోగించి చేపలు పడుతున్న క్రమంలో అదే విద్యుత్ తీగలకు తగిలి షాక్ గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని శశి మృతదేహం మీద పడి గుండలవిసేలా రోదించారు. కష్టపడి పెంచి పెద్ద చేస్తే ఇలా అర్ధాంతరంగా పోయావా కొడుకా అంటూ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. శశి మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్నాడు.

చెరువులో జారిపడి వృద్ధుడు..



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: చెరువులో జారిపడి ఓ వృద్ధుడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పాంనూర్‌లో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్లె నర్సయ్య(65) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామశివారులోని ఊర చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి అందులో జారి పడ్డాడు. కాగా, నర్సయ్య చెరువు వైపునకు వెళ్లడం చూసిన గొర్రెల కాపరులు..అతడు తిరిగి రాకపోవడంతో అనుమానంతో చెరువు వద్దకు వెళ్లి చూశారు. అక్కడ చెప్పులు కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న కుటుంబీకులు గొర్రెల కాపరుల సాయంతో చెరువులో మునిగిన నర్సయ్యను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి బంధువు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

పంటల సాగులో వైవిధ్యం ప్రదర్శించాలి

- వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి



మాట్లాడుతున్న ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి

మహబూబాబాద్ రూరల్ : రైతులు పంటల సాగులో వైవిధ్యం ప్రదర్శించడంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. మంగళవారం మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో 2025– 26 సంవత్సరానికి సంబంధించిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏడీఆర్ ఉమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యవసాయంలో పంట మార్పిడి, యాంత్రీకరణ, కొత్త రకాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. వరి, పత్తి, మొక్కజొన్నతోపాటు తృణధాన్యాలు, పప్పు దినుసు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో హైదరాబాద్ నుంచి ఐ కార్ అటారి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ.ఆర్.రెడ్డి, పీజేటీఏయూ విస్తరణ సంచాలకుడు, నామిని ఎలక్ట్రానిక్ వింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిశోర్ కుమార్, డాక్టర్ ఈ.రాంబాబు. బి.క్రాంతికుమార్, ఉద్యాన, పశువైద్య శాఖల జిల్లా అధికారులు మరియన్న, కిరణ్ కుమార్, మానుకోట, మరిపెడ ఏడీఏలు శ్రీనివాసరావు, విజయ్ చంద్ర, ఏఓలు తిరుపతిరెడ్డి, మురళి, ఉద్యాన శాఖ అధికారి శాంతిప్రియ, అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ, వాహిని, రాజు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది నవంబర్–డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, బీ ఒకేషనల్ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 70,661మంది విద్యార్థులకు 15,495 మంది ఉత్తీర్ణత (21.93శాతం) సాధించారు. మూడో సెమిస్టర్ పరీక్షల్లో 59,916 మంది పరీక్షలు రాయగా అందులో17,356 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (28.97శాతం) సాధించారు. ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 46,828 మంది పరీక్షలకు హాజరుకాగా అందులో 19,074 మంది ఉత్తీర్ణత (40.73శాతం) సాధించారని పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ తెలిపారు. పూర్తి వివరాలే కేయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం. తిరుమలాదేవి, వెంకటయ్య, కేయూ పాలకమండలి సభ్యులు బి. సురేశ్‌లాల్, చిర్రరాజు, ఆర్ట్స్అండ్ సైన్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామా వెంకటేశ్వర్లు, క్యాంపు ఆఫీసర్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల మధ్య అగాధం

- సీనియర్ జర్నలిస్టు కె. శ్రీనివాస్



మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్

కేయూ క్యాంపస్ : తెలంగాణలో కొన్ని వర్గాలు పని చేయడానికి విముఖతతో ఇతర రాష్ట్ర కార్మికులు వలస వస్తున్నారని, దీని వల్ల ఉపాధి అవకాశాల మధ్య అగాధం పెరిగిందని సీనియర్ జర్నలిస్టు కె. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కేయూ గణిత శాస్త్ర విభాగ సెమినార్ హాల్‌లో వీసీ కె. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆచార్య బి. జనార్దన్ రావు 23వ వార్షిక స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ప్రధాన వక్తగా విచ్చేసి 'తెలంగాణ ఆఫ్టర్ ఎ డికెడ్ ఎమర్జింగ్ పొలిటికల్ అండ్ సోషల్ సీనారియోస్' అనే అంశంపై శ్రీనివాస్ ప్రసంగించారు. భవిష్యత్ తెలంగాణకు విలువలతో కూడిన విధాన చట్రం అవసరమన్నారు. గొప్ప తాత్త్విక సిద్ధాంతకర్త ఆచార్య బి. జనార్దన్ రావు అన్నారు. సమగ్ర అభివృద్ధితో కూడికొని ఊహించిన తెలంగాణ రూపకల్పన చేశారన్నారు. ఆయన ఊహకు అనుగుణంగా అభివృద్ధి జరగలేదన్నారు. తెలంగాణ గ్రామాలు డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌లు వ్యసనాల బారిలో పడి చిక్కుకున్నాయన్నారు. అలాగే, ఉపాధి అవకాశాల మధ్య అగాధం పెరిగిందన్నారు. చిరు వ్యాపారుల్లో ఉత్తరాది వారి ప్రాబల్యం పెరిగిందన్నారు. దీని నివారణకు జోక్యం అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో బియ్యాల జనార్దన్ రావు మెమోరియల్ ఫౌండేషన్ బాధ్యులు ఈ.రేవతి, కె. మురళీ మనోహర్, నరేంద్ర బాబు, జనార్దన్ రావు ట్రస్టు కార్యదర్శి టి. బుచ్చిబాబురావు, తదితరులు పాల్గొన్నారు. తొలుత జనార్దన్‌రావు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు.

పర్యాటకులూ.. జర జాగ్రత్త

- పాకాల సరస్సు ఒడ్డుపైకి చేరిన మొసలి
- సరస్సులో దిగొద్దని ఎఫ్ఆర్వో సూచన



పాకాలలో ఒడ్డుపైకి చేరిన మొసలి

ఖానాపురం: వరంగల్ జిల్లాలో ఏకైక పర్యాటక ప్రాంతం పాకాల. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తారు. అటవీ అందాలను వీక్షించిన అనంతరం సరస్సులో జలకలాడుతారు. అయితే ఇప్పటి నుంచి సరస్సులో దిగకుండా ఉండడం శ్రేయస్కరం. ఎందుకంటే మంగళవారం మొసలి.. సరస్సు ఒడ్డుకు చేరుకుని సేదదీరింది. దీంతో పర్యాటకులు సరస్సులో దిగొద్దని ఎఫ్ఆర్వో రవికిరణ్ సూచించారు.

సృజనాత్మకత పెంపునకు ఫెస్ట్‌లు దోహదం

- పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భైరి ప్రభాకర్



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, న్యాయనిర్ణేతలు

రామన్నపేట: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఫెస్ట్‌లు ఎంతో దోహదపడుతాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్ ప్రిన్సిపాల్ భైరి ప్రభాకర్ అన్నారు. కళాశాల ప్రాంగణంలో జిల్లాస్థాయి 'సృజనా టెక్‌ఫెస్ట్ (2024 – 25)'ను మంగళవారం నిర్వహించారు. టెక్ ఫెస్ట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు మెకానికల్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎన్ఐటీ ప్రొఫెసర్ ఎ.కుమార్, టీజీఆర్‌టీసీ హనుమకొండ డిప్యూటీ రీజనల్ మేనేజర్ జి.మాధవరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈమేరకు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల పరకాలకు మొదటి బహుమతి, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్‌కు రెండో బహుమతి, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల కాటారంనకు మూడో బహుమతి, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్‌కు మొదటి బహుమతిని అతిథులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, జిల్లా కోఆర్డినేటర్ ఎం.వెంకన్న, కంప్యూటర్ సైన్స్ ఇన్‌చార్జ్ విభాగాధిపతి, జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవీందర్, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

అదే ప్రాంతం.. అక్కడే ప్రమాదం

బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

- సుబ్బయ్యపల్లి పెట్రోల్ పంప్ వద్ద ఘటన
- ఐదు నెలల్లో.. ఐదుగురు మృతి



రవి మృతదేహం



ప్రధాన రహదారి

హసన్‌పర్తి : అదే ప్రాంతం.. అక్కడే మరో రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన వడ్డేపల్లి చర్చి–ఉనికిచర్ల ప్రధాన రహదారిలోని సుబ్బయ్యపల్లి పెట్రోల్ పంప్ వద్ద మంగళవారం జరిగింది. కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన తడుగుల రవి(41) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పురుగు మందుల కొనుగోలు నిమిత్తం బైక్‌పై సుబ్బయ్యపల్లికి వచ్చాడు. అనంతరం ఇంటికి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మార్గమధ్య సుబ్బయ్యపల్లి సమీపంలోని పంప్‌లో పెట్రోల్ పోసుకుని ముందుకు సాగాడు. అయితే బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై దేవేందర్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ప్రజల ఆందోళన

సుబ్బయ్యపల్లి పెట్రోల్ పంప్ సమీపంలో వరుస ఘటనలు జరిగి యువకులు ప్రాణాలు వదలడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అక్కడ ప్రమాదం జరిగితే మృత్యుఒడికే..

వడ్డేపల్లి చర్చి–ఉనికిచర్ల ప్రధాన రహదారిలోని సుబ్బయ్యపల్లి పెట్రోల్ పంప్ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ప్రమాదం జరిగితే నేరుగా మృత్యుఒడికి వెళ్లాల్సిందే. ఐదు నెలల్లో ఐదుగురు బైక్ అదుపు తప్పి డివైడర్లకు ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. సరిగ్గా నెల రోజుల క్రితం ముప్పారం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇదే ప్రాంతంలో బైక్ అదుపు తప్పి మృతి చెందాడు. అలాగే, ధర్మసాగరం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన మహేశ్ ఇదే ప్రాంతంలో ప్రాణాలు వదిలాడు. మరో ఇద్దరు యువకులు కూడా బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని మృతి చెందారు.